## CONSOLIDATED COVERAGE REPORT
**State of Working India - 2021**

**Andhra Prabha**
**Date: 10 May 2021**

# కరోనా శాపం పేదరికం

- కొవిడ్ దెబ్బతో కుటుంబాలకు ఆదాయలేమి
- అవ్యవస్థీకృతరంగంలో దారుణ పరిస్థితులు
- పేదల ఆదాయం మరింత తక్కువైంది
- పేదరికంలోకి లక్షలాది మంది
- అసమానతలు పెరిగాయంటున్న పలు రిపోర్టులు
- కుటుంబాల ఆదాయ తగ్గుదలతో వినియోగంపై ప్రభావం
- దేశీయ వృద్ధి రేటుకూ విఘాతం



**న్యూఢిల్లీ :** కొవిడ్ మహమ్మారి దెబ్బకు భారత్‌లో పేదరికం పెరిగిపోతోంది. ఆదాయలేమితో కుటుంబాలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నాయి. గతేడాది కొవిడ్ లాక్‌డౌన్ పరిస్థితుల ఫలితంగా భారత్‌లో అసమానతలు పెరిగాయి. కొవిడ్ మహమ్మారి ప్రారంభమైన నాటి నుంచి 75 మిలియన్ల మంది భారతీయులు పేదరికంలోకి దిగజారారు. సెకండ్ వేవ్ మరి కొంతమందిని పేదలు మార్చడం ఖాయంగా కనిపిస్తోందని పీవ్ రీసెర్చ్ సెంటర్ రిపోర్ట్ పేర్కొంది. రోజు ఆదాయం రూ.150 లేదా అంతకంటే తక్కువగా ఉంటే పేదలు, రూ.151-750 మధ్య ఉంటే తక్కువ ఆదాయం, రూ.3,750 పైగా సంపాదిస్తే అధిక ఆదాయంగా పీవ్ పరిగణిస్తోంది. పేదరికానికి సంబంధించి బెంగళూరులోని అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ డేటా మరింత ఆందోళనకు గురిచేస్తోంది. జాతీయ కనిష్ఠ సగటు కూలీ రూ.375 దిగువకు 230 మిలియన్లకుపైగా వ్యక్తులు కరోనా సమయంలో దిగజారారని ప్రేమ్‌జీ వర్సిటీ రిపోర్ట్ పేర్కొంది. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా భారత్ ఇంకా కొనసాగుతున్నప్పటికీ అత్యధిక అసమానతలు ఉన్న దేశాల్లో భారత్‌లో కూడా ఒకటిగా ఉండబోతోందని ఆక్స్‌ఫామ్ అనే అనే స్వచ్ఛంద సేవా సంస్థ రిపోర్ట్ ఆందోళన వ్యక్తం చేసింది. అవ్యవస్థీకృత రంగంలోని కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు భారత దీర్ఘకాల వృద్ధి అంచనాలను దెబ్బతీయనున్నాయని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవస్థీకృతకృతం సాధారణ పరిస్థితులకు చేరువైనా.. అవ్యవస్థీకృతరంగం ఇంకా ఒత్తిడిలోనే ఉండడంతో ఇప్పటికే అసమానతలు పెరిగిపోయాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

### సేవింగ్స్‌లో క్షీణత

కుటుంబాల సేవింగ్స్‌లో క్షీణతపై ఆర్థిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదాయాల్లో తగ్గుదల ప్రభావంతో దేశీయంగా వినియోగంపై ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. దేశీయ వినియోగం దేశ జీడీపీలో దాదాపు 60 శాతంగా ఉందని గుర్తు చేస్తున్నారు. ముంబై కేంద్రంగా పనిచేస్తున్న బ్రోకరేజీ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ఆర్థికవేత్త నిఖిల్ గుప్తా అధ్యయనం ప్రకారం.. కుటుంబాల సేవింగ్స్ డిసెంబర్ త్రైమాసికంలో జీడీపీలో 22.1 శాతానికి పడిపోయాయి. పూర్తి ఏడాది గణాంకాలను పరిశీలించినా సేవింగ్స్ వృద్ధి రేటు విషయంలో యూఎస్, యూకే, జపాన్ వంటి దేశాల తర్వాతి స్థానాల్లోనే నిలిచిందని ఆయన పేర్కొన్నారు. కుటుంబాల సేవింగ్స్ నెమ్మదిగా పెరుగుతుండ డం వినియో గంలో తగ్గుదలను సూచిస్తుంది. ఈ అంశం భారత్‌లో ఆదాయం బలహీనంగా ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తోందని గుప్తా పేర్కొన్నారు. ఇదే ఒరవడి కొనసాగితే రికవరీకి కీలకమైన డిమాండ్ పెరుగుదల ఇతర దేశాలతో పోల్చితే తక్కువగానే ఉంటుందని పేర్కొన్నారు.

### ఏప్రిల్‌లో నిరుద్యోగం భారీగా పెరుగుదల

ఏప్రిల్‌లో నిరుద్యోగ రేటు దాదాపు 8 శాతానికి పెరిగిందని, మార్చిలో 6.5 శాతం ఉండగా భారీగా పెరిగిందని ప్రైవేటు మేథోసంస్థ సీఎంఐఈ(సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ) డేటా పేర్కొంది. ఏప్రిల్‌లో 70 లక్షల మందిపైగా ఉపాధికి దూరమయ్యారని డేటా స్పందించింది. మార్చితో ముగిసిన ఆర్థికసంవత్సరం 2020-21లో దేశీయ జీడీపీ 8 శాతం మేర క్షీణించిందని ప్రభుత్వం అంచనా వేసింది. 1952 తర్వాత ఇదే అతిపెద్ద క్షీణతగా ఉంది. కొవిడ్ సెకండ్ వేవ్ ప్రభావంతో నిరుద్యోగం భారీగా పెరగడం, సేవింగ్స్ భారీగా క్షీణించి పోతున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2021-22లో వృద్ధి అంచనాలను రేటింగ్ ఏజెన్సీలు తగ్గిస్తూ వస్తున్నాయి. ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్‌లో ఆసియా పసిఫిక్ చీఫ్ ఎకనామిస్ట్ షాన్ రోచీ స్పందిస్తూ... ఈ ఏడాది భారత వృద్ధి రేటు అంచనాలను 11 శాతం నుంచి 9.8 శాతానికి తగ్గించారు. ఫిచ్ సొల్యూషన్స్ 9.5 శాతంగా, బ్లూంబర్గ్ 11 శాతం దిగువన అంచనా వేశాయి. కొవిడ్ సెకండ్ వేవ్ ఉధృతితో భారత ఆర్థిక వ్యవస్థ రికవరీ దారుణంగా దెబ్బతిందని రోచీ పేర్కొన్నారు. కొవిడ్‌కు ముందునాటి నుంచి భారత్ ఉత్పత్తి నష్టాన్ని చవిచూసింది. కొవిడ్ కారణంగా దీర్ఘకాలంపాటు ఉత్పత్తి పతనమవ్వడం జీడీపీలో 10 శాతంతో సమానమని రోచీ విశ్లేషించారు.

### సెకండ్‌వేవ్ ప్రభావం ఎక్కువే..

ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన, పెద్ద రాష్ట్రాలు కొవిడ్ నియంత్రణకు ఆంక్షలు విధించడంతో దేశంలో పేదరికం మరోసారి విజృంభించే అవకాశాలున్నాయి. 2020లో లాక్‌డౌన్ ప్రభావం మాదిరిగానే పేదరికం జడలు విప్పే అవకాశాలు ఉన్నాయంటున్నారు. కాగా గతేడాది ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్‌తో నగరాలు, పట్టణాల్లోని వలస కూలీలు దయనీయ పరిస్థితులు ఎదుర్కొన్నారు. ఉపాధి లేక, తింటానికి తిండి, ఉంటానికి ఇళ్లు లేక వందలాది కిలోమీటర్లు కాలినడక మీదనే స్వస్థలాలకు చేరుకున్నారు. దయనీయమైన ఈ పరిస్థితులు అందరినీ కంటతడి పెట్టించాయి. అవ్యవస్థీకృత రంగంలో 411 మిలియన్ల మంది పనిచేస్తున్నారని అంచనాగా ఉంది. నేషనల్ స్టాటస్టికల్ ఆఫీస్ గణాంకాలు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. కనిష్ఠ కూలీ ఉండే వ్యవసాయ రంగంలో అవ్యవస్థీకృత రంగ కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఆ తర్వాత అత్యధికంగా నిర్మాణ రంగంలో 56 మిలియన్ల మంది పనిచేస్తున్నారు. అవ్యవస్థీకృత రంగంలో పనిచేసే వారికి ప్రభుత్వాల భద్రత తక్కువగా ఉంటుంది. కూలీలు రోజువారీ ఖర్చులు పోగా మిలిగిన చాలా తక్కువ మొత్తాన్ని వైద్య రక్షణ, మెడిసిన్ కోసం వినియోగిస్తారు. వ్యాధులు వస్తే వీరంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. మరోవైపు కొవిడ్ సెకండ్ కేసులతో ఆదివారం నాటికి మొత్తం కేసుల సంఖ్య 21.89 మిలియన్లకు చేరింది. మూడో వంతు కేసులు గత మూడు వారాల్లోనే నమోదవ్వడం వైరస్ తీవ్రతను తెలియజేస్తోంది. ఒక్క శనివారమే 4,187 మరణాలు నమోదయ్యాయి. రానున్న వారాల్లో సంక్షోభం మరింత తీవ్రమవనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. జులై నాటికి మొత్తం మరణాల సంఖ్య 10,18,879 వరకు చేరవచ్చునని లెక్కగడుతున్నారు.